## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మెదక్ రూరల్, జూన్ 24: పాతురు, మాక్త భూపతిపూర్ సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ మరమ్మతులు, స్తంభాలు, కరెంట్ వైర్లు తదతర పనుల నిమిత్తం మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని మెదక్ ట్రాన్స్‌కో ఏడీఈ మోహన్ బాబు, రూరల్ ఏఈ తిరుపతిరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి 12 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపేస్తారన్నారు. ఈ విషయంలో ప్రజలు సహకరించాలని కోరారు.

## నేడు రైతులకు వీడియో కాన్ఫరెన్స్

చిలిపిచెడ్, జూన్ 24: మండలంలోని చిట్కుల్, చిలిపిచెడ్ క్లస్టర్ రైతులకు మంగళవారం కొల్చారం రైతువేదికలో వీడియో కాన్ఫరెన్స్ ఉంటుందని ఏఈవోలు భూపాల్, రమ్య తెలిపారు. ఈ కాన్ఫరెన్స్‌లో విత్తనాల ఎంపిక, వానకాలంలో పంటల్లో పలు సూచనలు గురించి శాస్త్రవేత్తలు, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రితో అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు.

### అధికారులూ ఇటు చూడరా..



రామాయంపేట ఎంపీపీ కార్యాలయం ఎదుట పగిలిన స్లాబ్

రామాయంపేట, జూన్ 24: రామాయంపేటలోని ఎంపీపీ కార్యాలయానికి కూతవేటు దూరంలో తెలంగాణ తల్లి విగ్రహం వద్ద ఆరు నెలల కిందట రోడ్డుపై వేసిన స్లాబు పెచ్చులూడి గుంత ఏర్పడింది. ఇది ప్రమాదాలకు నిలయంగా మారింది. రోడ్డు పక్కన తెలంగాణ తల్లి విగ్రహం ముందే గుంత ఉన్నా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదు. ఇప్పకైనా అధికారులు రోడ్డుకు మరమ్మతులు చేస్తే ప్రమాదాలు అరికట్టవచ్చని స్థానికులు చెబుతున్నారు.

## రైతు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా



మిట్టపల్లి దీపిక, ఏఈ

నర్సాపూర్, జూన్ 24: రైతులకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఏఈ మిట్టపల్లి దీపిక అన్నారు. వ్యవసాయాధికారిగా నూతనంగా నియమించబడిన దీపిక సోమవారం బాధ్యతలు స్వీకరించారు. మండల ఇన్‌చార్జి వ్యవసాయాధికారిగా విధులు నిర్వర్తించిన దొంతి వెంకట రాజశేఖర్ నుంచి ఆమె బాధ్యతలు స్వీకరించారు.

## స్థలాన్ని కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

మెదక్ అర్బన్, జూన్ 24: బీడీ కార్మికుల ఇంటి స్థలాన్ని కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కలెక్టరేట్‌లోని ప్రజావాణిలో సోమవారం దళిత బహుజన ఫ్రంట్ సీఐటీయూ ఆధ్వర్యంలో 88 మంది ఫిర్యాదు చేశారు. నిజాంపేట్ మండలం నస్కల్ గ్రామంలో సర్వే నెంబర్ 842లో ఆరెకరాల భూమిని బీడీ కార్మికులు యజమాని గద్దె నాగభూషణం వద్ద 1991లో కొన్నారని, 62 మంది బీడీ కార్మికులు రెండు గుంటల చొప్పున పంచుకుని ప్రహరీ నిర్మించుకున్నారన్నారు.

## దుకాణ సముదాయాల వేలం వాయిదా

వెల్దుర్తి, జూన్ 24: వెల్దుర్తి సొసైటీ ఆధ్వర్యంలో 10 దుకాణ సముదాయాలను నిర్మించారు. వాటికి సంబంధించి అద్దె కోసం సొసైటీ చైర్మన్ అనంతరెడ్డి అధ్యక్షతన సోమవారం వేలం పాట ఏర్పాటుచేశారు. ఈ పాటలో ఇద్దరే పాల్గొన్నారు. దీంతో వేలం పాటను వాయిదా వేశారు. వచ్చే నెల 1న వేలం పాట నిర్వహిస్తామని సొసైటీ చైర్మన్ అనంతరెడ్డి లిపారు. కార్యక్రమంలో సీఈవో సిద్దయ్య, డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలల బంద్‌ను విజయవంతం చేయాలి


నిజాంపేట, జూన్ 24: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేస్తూ ఏబీవీపీ ఆధ్వర్యంలో రేపు చేపట్టనున్న పాఠశాలల బంద్‌ను విజయవంతం చేయాలని రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బండారి ప్రశాంత్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో పెండింగ్‌లో ఉన్న టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

## ఎమ్మార్పీఎస్ కమిటీ ఎన్నిక

వెల్దుర్తి, జూన్ 24: మాసాయిపేట ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీని సోమవారం ఎన్నుకున్నట్లు యాదగిరి మాదిగ తెలిపారు. అధ్యక్షుడిగా బొడ్డు నరేశ్ మాదిగ, ఉపాధ్యక్షులుగా ముక్క శ్రీకాంత్ మాదిగ, ప్రధాన కార్యదర్శిగా శేషన్ శరత్ మాదిగ, ప్రచార కార్యదర్శిగా గౌరగల్ల శివశంకర్ మాదిగ, కోశాధికారిగా తుడుం శ్రీకాంత్, సలహాదారులుగా ఎర్ర శ్రీకాంత్ మాదిగ, మాసాయిపేట మండల ఇన్‌చార్జిగా ముక్క విశాల్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో శేఖులు, వినోద్, శోభ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీనివాస్ మృతి బీఆర్ఎస్ పార్టీకి తీరని లోటు

- మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు
- భౌతికకాయానికి నివాళి, కుటుంబ సభ్యులకు పరామర్శ



శ్రీనివాస్ పిల్లలను పరామర్శించిన గ్రామస్తులు, నాయకులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు



(ఇన్‌సెట్‌లో శ్రీనివాస్) సతీమణిని ఓదారుస్తున్న హరీశ్‌రావు

నర్సాపూర్, జూన్ 24: జక్కపల్లి మాజీ సర్పంచ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు దుప్తల శ్రీనివాస్ మరణం బీఆర్ఎస్ పార్టీకి తీరని లోటని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ సర్పంచ్ దుప్తల శ్రీనివాస్ (50) ఆదివారం గుండెపోటుతో మృతి చెందాడు. శ్రీనివాస్ మరణవార్త వినగానే హరీశ్‌రావు గ్రామానికి చేరుకుని భౌతిక ఖాయానికి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను ఓదార్చి, వారికి మనోధైర్యాన్ని కల్పించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమం నుంచి బీఆర్ఎస్‌లో ఉంటూ పార్టీకి విశేష సేవలు అందిస్తూ, క్రియాశీలక పాత్ర పోషించాడన్నారు. శ్రీనివాస్‌తో ఉన్న పరిచయాన్ని మాజీ మంత్రి నాయకులతో పంచుకున్నారు. శ్రీనివాస్ కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు.

**కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం..**

ఆదివారం సాయంత్రం చాతిలో నొప్పిగా ఉందని, పక్క గ్రామం చిప్పల్‌తుర్తి ఆర్ఎంపీ వైద్యుడి దగ్గరకు చికిత్స కోసం వెళ్లాడు. నొప్పి తీవ్రత పెరగడంతో దవాఖానలోనే శ్రీనివాస్ కుప్పకూలాడు. హుటాహుటిన నర్సాపూర్ దవాఖానకు తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందాడు. శ్రీనివాస్‌కు భార్య వెంకటలక్ష్మి, కుమారుడు, కూతురు ఉన్నారు. సర్పంచ్‌గా శ్రీనివాస్ ఒకసారి, ఆయన భార్య వెంకటలక్ష్మి రెండుసార్లు ప్రజలకు సేవలందించారు. శ్రీనివాస్ మంచితనాన్ని, సేవా కార్యక్రమాలను గుర్తుచేసుకుంటూ గ్రామస్తులు, నాయకులు కన్నీరుమున్నీరయ్యారు.

**నివాళులర్పించిన పలువురు**

ఎమ్మెల్సీ వెంకట్రామిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, వైస్ ఎంపీపీ వెంకటనర్సింరావు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ చంద్రాగౌడ్, ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ శివకుమార్, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, నాయకులు గోపి, లక్ష్మణ్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, ఛత్రునాయక్, రాజు యాదవ్, మల్లేశ్‌గౌడ్ నివాళులర్పించారు.

# సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

- ప్రజావాణిలో 206 దరఖాస్తులు
- క్రీడా పాఠశాలల్లో ఎంపికలు
- అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

మెదక్, జూన్ 24 (నమస్తే తెలంగాణ): ప్రజావాణిలో ప్రజల నుంచి వచ్చిన సమస్యలకు ప్రాధాన్యత ఇచ్చి సత్వర పరిష్కారానికి కృషి చేయాలని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు అధికారులను ఆదేశించారు. ఒకే సమస్యపై పలుమార్లు కలెక్టర్ కార్యాలయానికి వచ్చే ప్రజల సమస్యలకు శాశ్వత పరిష్కారం చేపట్టాలన్నారు. సోమవారం మెదక్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ 206 దరఖాస్తులు అదనపు కలెక్టర్‌కు అందజేశారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను ప్రాధాన్యతతో వెంటనే పరిష్కరించాలన్నారు. శాఖల వారీగా పెండింగ్‌లో ఉన్న సమస్యలకు అధిక ప్రాధాన్యత ఇచ్చి పరిష్కరించాలని సూచించారు. ప్రజావాణిలో పింఛన్లు 20, ఉద్యోగాలకు 15, ధరణి 50, డబుల్ బెడ్‌రూమ్ 50, ఇతర సమస్యలు 70 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. మొత్తం 206 దరఖాస్తులు ప్రజావాణిలో స్వీకరించామన్నారు. ఈ ప్రజావాణిలో జడ్పీ ఎల్లయ్య, డీఆర్డీవో పీడీ శ్రీనివాసరావు, కలెక్టరేట్ ఏవో యూనూస్, సంబంధిత ఇతర శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



ప్రజావాణిలో దరఖాస్తులను స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు



మెదక్ మున్సిపాలిటీ: క్రీడా పాఠశాలలో ప్రవేశాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అదనపు కలెక్టర్

**క్రీడా పాఠశాలల్లో ప్రవేశాలకు ఎంపికలు**

మెదక్ మున్సిపాలిటీ, జూన్ 24: ఈనెల 28న జిల్లా కేంద్రంలోని ఇందిరాగాంధీ స్టేడియం క్రీడా పాఠశాలల్లో ప్రవేశాలకు ఎంపికలు నిర్వహించనున్నట్లు అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. సోమవారం ఆయన చాంబర్‌లో సంబంధిత పోస్టర్‌ను జిల్లా యువజన, క్రీడాలధికారి నాగరాజు, పీడీలు మాదవరెడ్డి, దేవేందర్‌రెడ్డి, శ్రీనివాస్ తదితరులతో కలిసి ఆవిష్కరించారు. హకీంపేట, కరీంనగర్, ఆదిలాబాద్‌లోని ప్రభుత్వ క్రీడా పాఠశాలల్లో 4వ తరగతిలో ప్రవేశాలకు ఎంపిక చేపట్టనున్నట్లు వివరించారు. ఎంపికలకు పూర్తి ఏర్పాట్లు చేయాలని క్రీడా అధికారిని ఆదేశించారు. సందేహాలుంటే 9347344440, 949359438 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

# అర్జీదారుల సమస్యలు పరిష్కరించాలి

**- ఎస్పీ డాక్టర్ బాలస్వామి**



అర్జీదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ డాక్టర్ బాలస్వామి

మెదక్ అర్బన్, జూన్ 24: అర్జీదారుల సమస్యలు త్వరగా పరిష్కరించాలని జిల్లా ఎస్పీ సంబంధిత అధికారులకు సూచించారు. సోమవారం పోలీస్ జిల్లా ప్రధాన కార్యాలయంలో ఎస్పీ ఆధ్వర్యంలో ప్రజావాణి నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి పలువురి అర్జీదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. చిలిపిచెడ్ మండలం చిట్కుల్ గ్రామానికి చెందిన మంగలి కిష్టయ్యకు గ్రామ శివారులోని సొంత పట్టా భూమి ఉంది. ఆ సర్వే నంబర్ 484/1లో 19 గుంటలు, 529/ఆలో 05 గుంటలు, 530/ఇ1లో 0.216 గుంటల భూమి కలదని అయితే ఈ విషయమై మా యొక్క తమ్ముడి భార్య మంగలి పద్మ మా ఇరువురి కుటుంబాల మధ్య ఒరాల సరిహద్దుల విషయంలో తగాదాలు నడుస్తున్నాయని ఈ విషయంలో కోర్టులో కూడా కేసు నడుస్తుందన్నారు. కోర్టు తీర్పును తాను శిరసావహిస్తానని కానీ దౌర్జన్యంగా మా తమ్ముడు భార్య పద్మ అల్లుడు, వారి తమ్ముడు మంగలి శంకరయ్య డాకూర్ గ్రామం, మంగళి యాదగిరి, మంగలి గంగారం చౌటకూర్ గ్రామం, మంగలి వేణు అంగడిపేట వారు తమపై దౌర్జన్యం చేశారన్నారు. ఈ విషయమై నేను అక్కడికి వెళ్లి అడిగితే తనపై దాడి చేయడానికి ప్రయత్నించారని ఆరోపించారు. వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుని తనకు న్యాయం చేయాలని ఫిర్యాదు చేశారు. ఫిర్యాదీకి తగిన న్యాయం చేయాలని చిలిపిచేడ్ ఎస్సైకి ఎస్పీ సూచించారు.

**గొడవలకు కారణమైన ఎవరినీ వదిలిపెట్టం**

మెదక్‌లో ఇరువర్గాల్లో జరిగిన గొడవలు అదుపులోకి వచ్చాయని, కారణమైన అందరినీ అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలిస్తామని ఎస్పీ డాక్టర్ బాలస్వామి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండు వర్గాల మధ్య జరిగిన గొడవల్లో ఒక వ్యక్తి కత్తిపోట్లకు గురయ్యాడని, అల్లర్లలో ఒక వర్గానికి చెందిన వ్యక్తిని కత్తితో గాయపర్చిన మెదక్‌కు చెందిన మహ్మద్ అబ్దుల్ అతీక్ తండ్రి మహ్మద్ అబ్దుల్ ఖాదర్‌ను పట్టుకుని ఈ నెల 23న రిమాండ్‌కు తరలించామన్నారు. గొడవలకు సంబంధించిన అన్ని వీడియోలు ఉన్నాయని, వాటి ఆధారంగా నిందితులను గుర్తించామన్నారు. సమగ్ర విచారణ జరుగుతున్నదని, కారణమైన ఎవరినీ విడిచిపెట్టేది లేదన్నారు.

## నిబంధనల ప్రకారమే పరిహారం చెల్లిస్తాం: ఆర్డీవో




ఆర్డీవోకు వినతి పత్రం అందజేస్తున్న పెద్దగొట్టిముక్కల రైతులు

నర్సాపూర్/శివ్వంపేట, జూన్ 24: కాళేశ్వరం కాల్వ నిర్మాణంలో భాగంగా భూములు కోల్పోతున్న రైతులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారమే నష్టపరిహారం చెల్లిస్తామని ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి తెలిపారు. సోమవారం నర్సాపూర్‌లోని రైతువేదికలో సంగారెడ్డి కెనాల్ రీచ్-2లో భూములు కోల్పోతున్న శివ్వంపేట్ మండలం పెద్దగొట్టిముక్కల గ్రామానికి చెందిన రైతులతో అవార్డు విచారణ నిర్వహించారు. కాల్వ కోసం భూమి కోల్పోతున్న రైతులకు భూమికి భూమి లేదా ఎకరానికి రూ.60 లక్షలు ఇవ్వాలని రైతులు ఆర్డీవోకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో శివ్వంపేట్ తహసీల్దార్ శ్రీనివాస్‌చారి, లోక్‌సత్తా నియోజకవర్గ ఇన్‌చార్జి చంద్రశేఖర్, రైతులు పాల్గొన్నారు.

## పురపాలిక అభివృద్ధికి సహకరించండి

రామాయంపేట, జూన్ 24: పురపాలిక అభివృద్ధికి పార్టీలకతీతంగా కౌన్సిలర్లు ముందుకురావాలని మున్సిపల్ చైర్మన్ పల్లె జితేందర్‌గౌడ్, కమిషనర్ దేవేందర్ తెలిపారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో సాధారణ సమావేశం నిర్వహించారు. అనంతరం కమిషనర్ మాట్లాడారు. పురపాలికలో సభ్యుల సమక్షంలో వార్డుల అభివృద్ధికి సభ్యులందరు ఒప్పందం తెలిపినట్లు తెలిపారు. పట్టణంలో పారిశుధ్యం, సీజనల్ వ్యాధులు, బ్లీచింగ్ పౌడర్, వీధుల్లో దోమల నివారణకు చర్యలు, వీధిదీపాలు, తాగునీటి సమస్యలపై తీర్మానాలకు ఆమోదం తెలిపారు. సమావేశంలో వైస్ చైర్మన్ పుట్టి విజయలక్ష్మి, మేనేజర్ శ్రీనివాస్, కౌన్సిలర్లు దేమె యాదగిరి, గజవాడ నాగరాజు, సుందర్‌సింగ్, చింతల రాధాభవాని, చిలుక గంగాధర్, కో ఆప్షన్ సభ్యులు హాజరైనట్లు కమిషనర్ తెలిపారు.

## భూ తగాదాలో ఒకరికి కత్తిపోట్లు



శివ్వంపేట, జూన్ 24: భూ తగాదాల్లో ఒకరు కత్తిపోట్లకు గురైన ఘటన శివ్వంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని పెద్దగొట్టిముక్ల గ్రామంలో సోమవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దగొట్టిముక్లలో కొన్ని రోజులుగా మామిడి నర్సారెడ్డి కుటుంబీకులు, నాగిరెడ్డి గూడెం గ్రామానికి చెందిన గడ్డం రాజేందర్‌రెడ్డి కుటుంబీకులకు భూ తగాదా నడుస్తున్నది. సోమవారం ఇదే విషయంలో గడ్డం రాజేందర్‌రెడ్డి కుటుంబీకులైన గడ్డం శ్రీనివాస్‌రెడ్డిపై పెద్దగొట్టిముక్లకు చెందిన మామిడి నర్సారెడ్డి అనుచరులు కత్తితో దాడి చేశారు. వెంటనే గడ్డం శ్రీనివాస్‌రెడ్డిని నగరంలోని నారాయణ దవాఖానకు తరలించి చికిత్స అందిస్తున్నారు. ఆయన పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# సప్లిమెంటరీ ఫలితాలు విడుదల

**ప్రథమ 51.28 శాతం, ద్వితీయ సంవత్సరంలో 52.65 శాతం ఉత్తీర్ణత**

మెదక్ మున్సిపాలిటీ, జూన్ 24: ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలు సోమవారం విడుదలయ్యాయి. ప్రథమ సంవత్సరం ఫలితాల్లో జిలాలో ప్రథమ సంవత్సరంలో 3,518 మందికి 1,804 మంది, 51.28 శాతం, ద్వితీయ సంవత్సరంలో 2,186 మందికి 1,151 మంది 52.65 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఒకేషనల్ ప్రథమ సంవత్సరంలో 154 మందికి 105 మంది 68.18శాతం, ద్వితీయ సంవత్సరంలో 59.7 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఇంటర్ నోడల్ అధికారి సత్యనారాయణ తెలిపారు.

# నారు కొనలు తుంచి వేయాలి



జెప్తిశివునూర్‌లో వరి పొలాలను పరిశీలిస్తున్న రామాయంపేట ఏడీఏ వసంత సుగుణ

చేగుంట, జూన్ 24: ఆలస్యంగా నాట్లు వేసేవారు, నారుమడిలోనే కొనలు త్రుంచి వేయాలని, లేకుంటే నాటిన తరువాత మోగి పురుగు అధికమై పంట నాశనమయ్యే అవకాశం ఉంటుందని ఏడీఏ వసంతసుగుణ అన్నారు. నార్సింగి మండలం జెప్తిశివునూర్‌లో సోమవారం రైతుల నారు మడులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆలస్యంగా వేసే వరి నాట్లలో కొనలపై రెక్కల పురుగుల గుడ్లు ఉధృతంగా ఉంటాయన్నారు. ఆమె వెంట ఏఈవో దివ్య, విజృంభణ, రైతులు అజహర్‌షరీఫ్ తదితరులున్నారు.

## కారు ఢీకొని వ్యక్తి మృతి



పెంట్యా నాయక్ (ఫైల్)

కొడిపల్లి, జూన్ 24: కారు ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన కొడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని భారత్ పెట్రోల్ బంకు సమీపంలో సోమవారం జరిగింది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. ధర్మాసాగర్ గేటు తండాకు చెందిన దేవిసో పెంట్యా నాయక్ (44) కొడిపల్లిలో ఎరువుల దుకాణంలో విత్తనాలు కొనేందుకు రోడ్డు పక్కన నడుచుకుంటూ వస్తున్నాడు. ఈ క్రమంలో కొడిపల్లిలోని భారత్ పెట్రోల్ బంకు సమీపానికి రాగానే నర్సాపూర్ నుంచి మెదక్ వైపు వెళ్తున్న కారు రాంగ్ రూట్లో వచ్చి బాధితుడిని ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన బాధితుడిని స్థానికులు 108 వాహనంలో నర్సాపూర్ ప్రభుత్వ దవాఖానకు తరలిస్తుండగా, మార్గమధ్యలో మృతి చెందాడు. ఎస్సై రంజిత్‌రెడ్డి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

### భూ వివాదంలో పలువురిపై కేసు

వెల్దుర్తి, జూన్ 24: భూ వివాదంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ తలెత్తడంతో పలువురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నవత సోమవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఆరెగూడెం గ్రామానికి చెందిన కౌడె మాధవి అదే గ్రామానికి చెందిన ప్రతాప్‌రెడ్డికి చెందిన 165 గజాల స్థలాన్ని 2021లో కొని, బేస్మిట్ నిర్మించింది. వెన్నవరం గోవింద్‌రెడ్డి, మాధవి స్థలంలో తనదీ ఉందని అడిగాడు. తమ స్థలాన్ని ఎవరికీ ఇవ్వమని చెప్పగా, పలువురుతో కలిసి దాడి చేశాడు. మాధవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

# బడీడు విద్యార్థి బడిలోకి..



విద్యార్థి తండ్రితో మాట్లాడుతున్న ఎంపీడీవో లక్ష్మీనర్సింహులు

కొల్చారం, జూన్ 24: మండలంలోని సంగాయిపేట గ్రామానికి చెందిన ఎంబరి పుష్పలత ఏడో తరగతి వరకు చదివి, ఆర్థిక పరిస్థితి బాగాలేక మధ్యలోనే బడి మానేసింది. చెప్పుడు మాటలకు తలొగ్గిన విద్యార్థి తండ్రి అమ్మాయికి పెళ్లి చేయాలని నిర్ణయించుకున్నాడు. సోమవారం ఎంపీడీవో లక్ష్మీనర్సింహులుకు సమాచారం రాగా వెంటనే సంగాయిపేటకు చేరుకుని విద్యార్థి తల్లిదండ్రులతో మాట్లాడి బడికి పంపించాలని కౌన్సెలింగ్ ఇచ్చారు. తల్లిదండ్రులు ఒప్పుకోవడంతో కొల్చారం కస్తూర్బా గాంధీ పాఠశాలలో చేర్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో లక్ష్మీనర్సింహులు, పంచాయతీ కార్యదర్శి నాగరత్నం, అంగన్‌వాడీ టీచర్లు స్వరూప, హైమావతి, నింగమణి, కారోబార్ విఠల్ తదితరులు ఉన్నారు.

# హరితహారం మొక్కలపై గొడ్డలి వేటు



చిలిపిచెడ్‌లో నర్సాపూర్-జోగిపేట ప్రధాన రోడ్డు పక్కన నరికేసిన చెట్లు

చిలిపిచెడ్, జూన్ 24: హరితహారం మొక్కలపై గొడ్డలి వేటు పడింది. పచ్చదనమే ప్రగతికి మెట్టు అన్న లక్ష్యంతో తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ హయాంలో హరితహారంలో నాటిన మొక్కలు ఏపుగా పెరిగి నీడనిస్తున్నాయి. ఇప్పుడు ఆ మొక్కలు, చెట్లుగా మారి కరెంట్ లైన్లకు అడ్డు రావడంతో తొలిగిస్తున్నారు. చిలిపిచెడ్‌లో నర్సాపూర్-జోగిపేట ప్రధాన రహదారి పక్కన మండల కార్యాలయానికి వెళ్లే దారిలో ఉన్న చెట్లను నరికేశారు.

# మత్తు పదార్థాలకు దూరంగా ఉంచాలి



పాఠ్యపుస్తకాలను అందజేస్తున్న ఇంటర్ నోడల్ అధికారి సత్యనారాయణ

మెదక్ మున్సిపాలిటీ, జూన్ 24: మత్తు పదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని జిల్లా ఇంటర్ నోడల్ అధికారి సత్యనారాయణ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌గౌడ్ అధ్యక్షతన మత్తు పదార్థాలతో కలిగే నష్టాల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ యుక్త వయస్సులో విద్యార్థులు మత్తు పదార్థాలకు అలవాటు పడితే భవిష్యత్ నాశనం అవుతుందన్నారు. సదస్సు అనంతరం ప్రథమ, ద్వితీయ సంవత్సర విద్యార్థులకు ఉచిత పాఠ్య పుస్తకాలు అందజేశారు.

# రిలయన్స్ స్మార్ట్ స్టోర్‌కు జరిమానా



రిలయన్స్ స్మార్ట్ సూపర్ స్టోర్‌కు జరిమానా విధిస్తున్న మున్సిపల్ అధికారులు

మెదక్ మున్సిపాలిటీ, జూన్ 24: మెదక్‌లోని రిలయన్స్ స్మార్ట్ సూపర్ స్టోర్‌కు మున్సిపల్ అధికారులు జరిమానా విధించారు. పట్టణానికి చెందిన ప్రవీణ్ సోమవారం రిలయన్స్ స్మార్ట్ స్టోర్‌లో మొలకెత్తిన గింజలు, ఆపిల్స్ కొనడానికి వెళ్లగా, అవి పాడై బూజు పట్టి ఉన్నాయి. దీంతో వెంటనే మున్సిపల్ కమిషనర్ జానకీరామ్ సాగర్‌కు ఫిర్యాదు చేశాడు. మున్సిపల్ కమిషనర్ ఆదేశాలతో మున్సిపల్ సిబ్బంది స్మార్ట్ సూపర్ స్టోర్‌కు వెళ్లి తనిఖీలు చేపట్టగా పాడైపోయిన వస్తువులను గుర్తించారు. వాటిని స్వాధీనం చేసుకుని స్మార్ట్ స్టోర్‌కు రూ.10 వేలు జారిమానా విధించారు. ఆయన వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహేశ్, మున్సిపల్ సిబ్బంది నాగేంద్రబాబు, దౌలయ్య, మహబూబ్, శ్రీనివాస్ ఉన్నారు.

# బాలికల డిగ్రీ కళాశాలకు చైర్మన్ ఆర్థికసాయం



బాలికల డిగ్రీ గురుకుల కళాశాలకు ఫ్యాన్లు అందజేస్తున్న దృశ్యం

రామాయంపేట, జూన్ 24: రామాయంపేటలో కొత్తగా మంజూరైన బాలికల గురుకుల డిగ్రీ కళాశాలకు పురపాలిక చైర్మన్ పల్లె జితేందర్‌గౌడ్ సోమవారం ఆర్థిక సాయం అందజేశారు. పట్టణంలోని వాణి విద్యాలయంలో ఏర్పాటు చేసిన గురుకుల కళాశాలలో బాలికలకు సరైన సౌకర్యాలు లేకపోవడంతో ప్రిన్సిపాల్ అభ్యర్థన మేరకు రూ.25వేల విలువైన 10 ఫ్యాన్లు అందజేశారు. గతవారం తాగునీటికి బోరు బావి వేయించారు.

# అనుమతి లేకుండా పాఠ్యపుస్తకాలు అమ్మొద్దు

చేగుంట, జూన్ 24: ప్రైవేటు పాఠశాలల్లో అనుమతి లేకుండా పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్‌లు విక్రయించొద్దని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు సంతోష్ అన్నారు. చేగుంటలో ఆయన మాట్లాడుతూ చేగుంటలోని పలు ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల పెంచడం, పాఠ్య పుస్తకాల విక్రయాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. సమావేశంలో జిల్లా నాయకులు నవీన్, ప్రవీణ్ తదితరులున్నారు.

# షరతులు లేకుండా రుణమాఫీ చేయాలి

పాపన్నపేట, జూన్ 24: రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి షరతులు లేకుండా రుణమాఫీ చేయాలని సర్పంచుల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు కుమ్మరి జగన్ కోరారు. రాజశేఖర్‌రెడ్డి, కేసీఆర్ హయాంలో షరతులు లేకుండా రుణమాఫీ చేసిన విషయాన్ని గుర్తు చేశారు. కేసీఆర్ హయాంలో మేలోనే రైతులకు రైతుబంధు నిధులు విడుదల చేశారన్నారు. ప్రస్తుతం జూన్ ముగుస్తున్నా రైతుబంధు రాలేదన్నారు. వృద్ధాప్య పింఛన్ కూడా రెండు నెలలుగా అందక చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు.